# గవరమ్మగారి ముకురం!

**కృష్ణప్రియ**

**ఆకుపచ్చని లాన్‌లో కూర్చుని భావనా ప్రపంచంలో విహరించటం నా కిష్టం! ఎదురుగా టీపాయ్‌మీద ట్రేలో టీ సరంజామా వుంది.**

వర్షం కురిసి వెలిసిన ప్రశాంత ప్రకృతిలో నీలిగోరింట పూలు నేలమీద రంగోలిలమర్చినట్లు ఎంత బాగున్నాయి!

పాటకి పక్క వాద్యాలసరమైనట్లు నా ఊహాగానానికి లయగా లోపలనుంచి గవరమ్మగారి అష్టోత్తరనామాలు, వాటితోపాటు ప్రక్కింటి భజన్‌సింగ్ వంటగదిలో గిన్నెలతో ఆడే కొత్త రకం శబ్దాలు యివన్నీ అలవాటు మరి...

ఈ రోజు 'ఇంత నిశ్శబ్దంగా, గవరమ్మగారి గొంతు మాధుర్యం వినకుండా — ఈ టీ సహితం త్రాగబుద్ధి కావటంలేదు. ఈ రోజు సెలవు రోజు కాదుగా! పండుగ కానేకాదు — అయినా పండుగ రోజులు పనిలేనివారిక్కదా తెలిసేది. ఆదివారం కూడా పనిలో కొట్టుకునే నాలాంటివారికి — పండుగ తిరుబాటు మాత్రమెక్కడ?

'ఇంతకీ గవరమ్మగారు బెజవాడ బండెక్కెయ్య లేదు కదా? ఆవిడకింకా ఈ వ్యామోహాలెందుకో? ఎంత దసరా అయితే మాత్రం బొమ్మల కొలువులు చూడాలనే బుద్ధి ఏమిటి! 'అలా అనుకుంటుంటే— నాకు సిగ్గుగానే వుంది — ఎందుకంటే — నేను బొమ్మలంటే పడిచస్తాను. ఇన్నేళ్ళొచ్చినా. 'ఇంకా ఇదేం చిన్నతనం చేష్టలని — ఎవరైనా నవ్విపోతారని... పైకి పెద్దతరహాగా ప్రవర్తిస్తాను.

బొమ్మల మకాణం ముందునుంచి వెళ్తుంటే — అడుగులు తడబడ్తాయి నాకు. పాపం గవరమ్మగారూ అంతే. నా అన్నవాళ్ళు లేక — నావెంట ఢిల్లీ వచ్చినా ఆవిడ మనసంతా బెజవాడ మీదే! ఈ దసరా వచ్చిందంటే మరీని —

గవరమ్మగారు 'ఢిల్లీవచ్చి రెండేళ్ళయినా, ఒక్క హిందీ వాక్యం పట్టుపడకపోవటానికి కారణం ఆవిడ అంగికాభినయం!' ఆవిడ చెప్పే తీరుతోపాటు చే సైగలు ద్వారా అసలు విషయం అర్థమైపోతుంది.

అంతే కాని — బంగాళా దుంపలవాడు "కిలో రెండురూపాయలు చెప్తే!"

"నీ మొహం ఈడ్చా... ఇంకో రెండు దుంపలు వెయ్యిరా నాయనా!" అంటూ చనువుగా తీసుకుని బుట్టలో వేసుకుంటూంటే — అదేదో తనని ప్రేమగా దీవిస్తుందని కూరగాయలవాడు అడ్డు చెప్పకపోవటమే కాక — మరో దుంప ఆవిడ బుట్టలో వేసి వినమ్రంగా నిలబడతాడు. అప్పుడావిడ — "నీ వ్యాపారం చల్లగుండా!" అంటూ ఆదరంగా నవ్వి మరీ వెళ్తుంది లోపలికి.

ఈరోజు ఆవిడ ఇంట్లో తిరుగుతున్న అలికిడే లేదు. అసలు వంటగదిలో గిన్నెలు చప్పుడు కావటం లేదు. భజన్‌గాడు గోళ్ళు గిల్లుకుంటున్నాడు అంటే —నేను వెళ్ళే సమయానికి బ్రేక్ ఫాస్టు దొరకదన్నమాట!



"గవరమ్మగారెక్కడలా? రాత్రి కూడా చూడలేదామెని. నేనొచ్చే సమయానికి ఆవిడ - గణేష్‌యోగిగారి గెస్టుహౌస్‌కి వెళ్ళినట్లు తెలిసింది. తిరిగి రాలేదేమిటి చెప్మా? ఆ పక్కనే వున్న మిసెస్ కర్తార్‌సింగ్‌గారింట్లో వుండిపోయారేమో!"

మిసెస్ కర్తార్‌సింగ్ మిలటరీ కర్నలు భార్య. ఆవిడకి అంతపెద్ద ఇల్లు దానిలో నానావిధ జాతుల ఫల, పుష్పములు గల తోట శోభాయమానంగా వుంటుంది. విధివశాత్తు గవరమ్మగారు కూరగాయల నిండిన సంచులు భజన్‌చేత పట్టించుకుని — మిసెస్ కర్తార్‌సింగ్ ఇంటి ముందుగా వస్తున్నారు. గవరమ్మగారి నాసికాపుటాలకి సోకిన పరిమళం ఆవిడని ముందుకి పోకుండా నిర్బంధం చూపిన భజన్ కూడా మంత్రం వేసినట్లు ఆగిపోయాడు. గవరమ్మగారు కట్టిన కంచిపట్టు చీరను చూసి — ఆవిడ కంటి చూపులాసిన చెట్టుని పరికించి. నిముషంలో పసికట్టిన కర్తార్‌సింగ్‌గారి బీబీజీ చట్టున బయటికొచ్చి సందెడు కరివేపాకు రెమ్మలు విరిచి అంతతో ఊరుకోక లోపలికి పరుగెత్తి ఫ్రిజ్‌లో భద్రపరిచిన నాలుగు ములక్కాయలు కరివేపాకులో చేర్చి, గవరమ్మగారి సందిట సమకూర్చి సరసంగా నవ్విందట! గవరమ్మగారు తెలుగులోను, మిసెస్ కర్తార్‌సింగ్‌గారు హిందీలోను పరిచయాలు చెప్పుకుని, మళ్ళీ కలుసుకునేట్లు ఒప్పందాలు కుదుర్చుకుని — అప్పుడు వీడ్కోలు తీసుకున్నారట.

మిసెస్ కర్తార్‌సింగ్‌గారు 'హోదా వున్న రోజుల్లో' పోషల్ గేదరింగ్సులో బాగ ఆరితేరిన వారు. మిలటరీ క్యాంపుల్లో దక్షిణాదివారితోనే ఎక్కువ స్నేహం చేసేవారు. అప్పుడు మాత్రం భాషను గూర్చిన దిగుల్లేదు. అందరికి వచ్చిన ఇంగ్లీషు భాషలో నిరభ్యంతరంగా 'చర్చలు' సాగిపోయేవి — మిసెస్ కర్తార్‌సింగ్‌గారు అప్పటి రుచులు మరువలేదట! ఇప్పుడు గవరమ్మగారి పరిచయంతో తిరిగి ప్రారంభించబడ్డాయి. మొదట్లో ఇల్లంత సందడితో వర్ధిల్లుతుంటే, నా ఏకాంతానికి భంగం కలిగి విసుగ్గా వుండేది — గవరమ్మగారు గ్రహించేసి నేను పనిమీద వెళ్ళిపోయేక — ప్రారంభోత్సవాలు ప్రారంభించేవారు.

"ఈ రోజేమిటో గవరమ్మగారు గురించే ఇంత ఆలోచనలు? కొంపతీసి గవరమ్మగారు బెజవాడ రైలెక్కెయ్యలేదుకదా?" ఆవిడ వెళ్ళిపోతే ఈ ఇంటి పడవ నడిపేదెవరు బాబోయ్!

"మాతాజీ కహాఁహై?" భజన్‌ని అడిగేను ఆత్రంగా.

"క్షమేమెహై — బహుత్ సోచ్నేమే లగ్గయీ హైఁ!..."

ఆలోచనల్ని కట్టేసి 'టీ' పాట్ పట్టుకుని ఆవిడ గదిలోకి వెళ్ళి ఆలోచనాముద్రలో వున్న గవరమ్మగారి మంచంమీద ఓ పక్క కూర్చుని



## "అయ్యో తల్లీ! ఎంత అనాచారమే! మోకాళ్ళు దిగని గౌన్లు తొడిగి, హారతిచ్చేందుకు తయారయ్యేరు - వాళ్ళ మొహాలు, మంటపెట్ట! సాధుగారికి బుద్ధి జ్ఞానం లేదుటే అమ్మలూ!"

అప్పుడు టీ త్రాగాలనిపించగా కప్పులో పానుకు చప్పరించేను. అప్పుడడిగేను.

"ఏమిటిలా వున్నారు? మిసెస్ కర్తార్‌సింగ్ గారింటిలో డిన్నర్‌పార్టీకి పెరుగువడలు చెయ్యమన్నదా?" అన్నాను.

'సమాధానంగా' లే...దన్నట్లు తలమాత్ర మూపిందావిడ.

"మరింకేమయిందమ్మా... పనివాళ్ళుగాని మీ తిట్లు తినలేక ఎదురుతిరిగేరా?" ఈ అనుమానం నాకు చాలాకాలంగా వుంది.

"ఉహూఁ"

"బెజవాడ వెళ్ళాలనుందా?" అడగలేకే అడిగేను.

"చిన్నపిల్లలా అలా బేలగా అడుగుతున్న నన్ను ఆర్ద్రంగా చూసేరు గవరమ్మగారు. మాదెక్కడి అనుబంధమో? ఈ ఇంటిలో నిజంగానే గవర్నరు, ఎవరొచ్చినా ముందు నమస్కరించేదామెకే! ఆవిడ ధోరణి కలవాటుపడిన ప్రతి ఒక్కరూ ఆవిడని గౌరవించేరు. తిట్ల ధోరణిలో సాగే ఆవిడ వాక్ప్రవాహం — ఆనకట్ట ఎవరూ వెయ్యరు. ఎందుకంటే తెనుగు తిట్ల కర్థం — ఈ హిందీ వాళ్ళకు తెలియదు కనుక.

అప్పుడు గుర్తొచ్చింది. ఈవిడ మిసెస్ కర్తార్‌సింగ్‌తో కలిసి గణేష్‌యోగి గెస్టుహౌసుకి దర్శనార్థం వెళ్ళేని. అక్కడ గణేష్‌యోగిగారి నిలువెత్తు విగ్రహం సింహాసనంమీద ప్రతిష్ఠించబడి వుంటుంది. వారికి వెనుకగా సప్తఋషులు కూర్చుని వుంటారు. వారికి వెనకగా, అంటే చిట్టచివరగా విష్ణు, మహేశ్వరులతోపాటు — నాలుగు తలలతో బ్రహ్మకూడా విలపిల్లుతుంటాడు. అందరికన్నా అభయముద్రలో గణేష్‌యోగిగారు కూర్చుని వుంటారు. ఇదంతా మయసభలాగా కళ్ళు చెదిరి పోయేలా, ఒళ్ళు జలదరించేలా వుంటుంది. విష్ణు, మహేశ్వరులు అంగరక్షకులవలె వెనక సీట్లో నిర్జీవంగ నిలబడి జాలిగొలుపుతూంటారు పాపం. ఆ దారిన వస్తున్న నేను రోడ్డుమీద పరిచిన ఎర్ర మొహమల్ తివాచీలు చూసి దేశ సేవకులెవరైనా విచ్చేస్తున్నారేమోనని విస్తుపోతూ, కారు పక్కగా దిగి నిలబడ్డాను. తెల్లటి పొడుగాటి గడ్డమూ, ధనదర్పమనిపించే విధంగా గణేష్‌యోగి మొఖమల్ బట్టమీదుగా నడిచి, గెస్టుహౌసు ముందాగారు. అప్పటివరకు ఎక్కడ నక్కేరో మరి. అంగనామణులు ప్రాంగణం నిండుగా రంగు రంగుల గౌన్లు ధరించి చేత కొవ్వొత్తుల హారతులతో గణేష్‌యోగిగార్ని సమాదరించి లోపలికి తీసుకుపోయేరు. యోగిగారు కూర్చున్న వెంటనే ఓ గొప్ప పారిశ్రామికవేత్త బంగారు చెంబులో భార్య నీరు అందించగా, వెండి పళ్ళెంలో ఆయన కాళ్ళు కడిగి నెత్తిమీద జల్లుకున్నారు. ఆ దృశ్యం చూసిన నాకు, ఆంధ్రుల కన్యాదానాలు గుర్తొచ్చాయి. దశమగ్రహశాంతి ప్రకారం అల్లుడు కాళ్ళు అత్తమామలు కడుగుదురు. నే చూసిన సంగతి ఇది. ఇప్పుడు గవరమ్మగార్నింత ఇష్టబ్దం పరచిన సందర్భమేమై వుంటుందో మరి?

అసలీవిడకి గణేష్‌యోగిగారి మయసభ చూడాలనెందుకనిపించిందో? గవరమ్మగార్కి ఢిల్లీ పట్నం చాలా నచ్చిందట! కానీ బొమ్మల కొలువులు, కార్తీకదీపాలు, తద్ది పేరంటాళ్ళు ఎక్కడా కనపడక "ఇది ఊరా! పల్లకాడా?" అని చాలాసార్లు విస్తుపోయారు. మునుపెన్నడూ చూడని సమాజాన్నీ, ఇక్కడివారి మెచ్చుకోలు మాటలు ఆవిడకి చాలా వచ్చినవి. ఎటొచ్చి ఈ పండుగలప్పుడు మాత్రం ఈ సందడులు కనిపించక — ఈ ఊరుమీద విరక్తి కలిగించుకొంటుంటారు. మిసెస్ కర్తార్‌సింగ్‌గారు గవరమ్మగారి అభిలాష కనిపెట్టేసి — గణేష్ యోగిగారి కొలువుకి తీసుకెళ్ళారు.

నా టీ త్రాగటం పూర్తయింది. ఆవిడ మౌనాన్ని ఛేదించటం ఇష్టంలేదు. వెళ్ళేందుకు లేచేను. అప్పుడు గవరమ్మగారు తలెత్తేరు.

"రాత్రి యోగిగారింటిలో బొమ్మలకొలువు చూసేను" అన్నారు.



# అవినీతి ధ్వజం!

నీతికీ అవినీతికీ
మధ్య యుద్ధం ముగిసింది!
నీతి పరుగెడుతోంది

తలదాచుకోడాని 'కింత'
పిసరు చోటుకోసం —
మంచి మనిషి మనో మందిరంలో
ఏదైనా ఒక మూల

'ధైర్యం' దాక్కొందేమోనని—
అన్వేషిస్తూ అలమటిస్తూ
నీతి నిరాశ్రయంగా పరిగెడుతోంది!

అవినీతి దారుణంగా 'ధ్వజ'
మెత్తుకొని మంచివాడి
వెంటపడి వేటాడుతోంది
వేటాడి గొంతు నులిమి
'పార్టీ ఫిరాయించ' మంటూ
ఉరిమి ఉరిమి బెదిరిస్తోంది!

అవినీతి మూతిమీద
'నల్ల ధనం మీసాలు' వాటిమీద
నిమ్మకాయలు రాజకీయాల
కుళ్ళు కుతంత్రాలు!

'చట్టా'న్ని కాలిక్రింది చెప్పులాగ
తొక్కిపెడ్తా నంటూ
రక్కసి అవినీతి సవాల్ చేస్తోంది!

ఈ కరాళ నృత్యం అంతమొందించే
'పరాశక్తి' కోసం పట్టండి
తోరణాలు వీరణాలు
చెయ్యండి పూజలూ సంబరాలు
ఈ ఏడు కాకపోయినా వస్తుందేమో
'ఆ ప్రజా శక్తి' మరుసటేడు!!

— వి రా జీ

## గవరమ్మగారి దుఃఖం

సంభాషణ దారిలోపడింది కదాని ఆసక్తిగా వినేందుకు కూర్చున్నాను.

త్రిమూర్తులు ద్వారపాలకుల్లా కడపారి నిలబడ్డారు. యోగిగారు సింహాసనం మీద కూర్చున్నారు — ఎంత పాపిష్టిజన్మ నాది. ఎంత పాపం చూసేనే తల్లీ!... రాత్రంతా పీడకల్లే తల్లీ! నోరూ వాయీలేని పసిపిల్లలు సహితం బొమ్మల కొలువు క్రమపద్ధతిలో తీర్చగా చూసేను. అయినా తన ప్రతిమకి పూజ చేయించుకుంటూ తనే దీవిసా డేమిటి ?

గవరమ్మగారి మౌనవ్రతానికి కారణం తెలిసింది. ఈవిడ ఆలోచన గణేష్‌యోగిగారి పూజాగృహం గురించి. అక్కడ యోగిగారి నిలువెత్తు బొమ్మకి సర్వోపచారాలుచేసి డాలర్లుతో తాంబూలాలు సమర్పించబడుతుంటాయి. యోగిగారి అనుయాయులు తమ వసతి గృహంలో నివసించేవారినుంచి కేవలం 'డాలర్లు' మాత్రమే స్వీకరిస్తారు. అలా అనుకునేకన్నా డాలర్లు చెల్లించగలవారికే గణేష్ యోగిగారి దర్శనము. వసతిగృహంలో విశ్రమించే అవకాశమూను... పాపం గవరమ్మగారు ఆంధ్రుల ఆడపిల్లల బొమ్మలకొలువులకి సాపత్యంచేసి చూస్తున్నారు.

''అయ్యో తల్లీ! ఎంత అనాచారమే! మోకాళ్ళు దిగని గౌన్లు తొడిగి, హారతిచ్చేందుకు తయారయ్యేరు — వాళ్ళ మొహాలు, మంటపెట్ట! సాధుగారికి బుద్ధి జ్ఞానం లేదుటే అమ్మలూ!''

'ఎంచక్కా' పట్టుపావడా కట్టి, జడకుచ్చులు పెట్టి, చామంతిపూలు తురిమిన — ఆడపిల్లలు కర్పూరహారతి పడితే — ఎంత పుణ్యము— ఎంత...'

గవరమ్మగారి వాక్ప్రవాహమింకాగదు మరి — అందుకే అన్నాను.

''ఇంతచేసి — మన అమ్మాయిల హారతులు — రూపాయలకి వారి హారతులు ఖరీదు — డాలర్లకీ, ముడిపడివుంటుందిగాని. ఇక లేచి — భజన్‌సింగ్‌ని మనసారా దీవించండి!'' అన్నాను.

''నువ్వెన్నైనా అనమ్మాయ్! యిది చాలా అన్యాయం! యిలా దేవుణ్ణి మోసగించటం ఏం బాగుందో చెప్పు ?''

నిలేసి అడుగుతూందావిడ... నవ్వొచ్చింది నాకు.

ఇచ్చే వారుంటే పుచ్చుకునేవారుంటారమ్మా! దేవుళ్ళనీ వాళ్ళ ఏజంటుల్ని వొదిలెయ్యండి — ఈత కాయిచ్చి — తాటికాయ పుచ్చుకునే — మీ మిసెస్ కర్తార్‌సింగ్ మాటేమిటి ?


ఇది చాలాకాలం నుంచి నా మనసులో మసులుతున్న ప్రశ్న.

ఆవిడా యోగిగారి శిష్యురాలేననుకోండి. ఏదో ఒక చాకచక్యం ఉపయోగించి వారినుంచి వీరినుంచి డబ్బు రాబట్టుకొనటానికి ఉపయోగించే విద్యలివి. గణేష్‌యోగి పదివేల రూపాయల అద్దె మాసానికి చెల్లిస్తారు. పరివారానికి మరో పదివేలు మాసపు ఖర్చులట. ఇదంతా ఏదో విధంగా సంపాదించాలిగా మరి. హృషీకేశ్‌లో కాలీకంబ్లీవాలా కొండ చెరియల్లో ముక్కు మూసుక్కూర్చుంటే ఇంత అట్టహాసంగా ఎలా సంపాదించగలడూ ?

నిజానికక్కడ కూడా అమెరికన్ల అభిరుచి ప్రకారం కొండగుహ అలంకరించేరని, మిలియన్ డాలర్లు ఖర్చయ్యాయని ప్రతీతనుకోండి.

నా మాటలకి గవరమ్మగారు తలపంకించేరు. లేవబోతూ గోడమీదున్న కేలెండర్లోకి చూశాను. విజయదశమికి గవరమ్మగారు గుర్తుగా పెట్టుకున్న మార్కు కొట్టొచ్చినట్లుంది. ఆవిడ మరచిపోని చిన్ననాటి కొలువుల గురించి నేను ఊహించగలను. గణేష్‌యోగిగారి బొమ్మల కొలువు మాత్రం అన్ని కాలాలలోను, ఢిల్లీ ప్రజలకు కనువిందు చేయుచుందును. కాదంటే దసరా బొమ్మల కొలువుల్లో దేవదేవులు ముందు సీట్లలో కాక—వెనక తరగతిలో నిల్చివుంటారు.

## మహిషాసుర మర్దని



-ఫొటో : యడవల్లి సుధాకర్.